# వాన

వెంకటసామికి అసహనంగా వుంది. జన్మరంది పట్టుకున్నది. సగం ఎండిపోయిన అల్లనేరేడి చెట్టుకింద కూలవడ్డడు. కాల్లు రిల్లలు పట్టినట్లు... నరాలు జలుపుతున్నట్టు...పెయ్యి సొడ సోడలు పోయినట్టు... మనుసంత చాకలి కుండల మాగవెట్టినట్టు... ఎట్లనో గేరచ్చినట్టే అయితంది.

చెవులు చిల్లులు పడెటట్లు బోరింగ్‌లు వేస్తుండ్రు... బోరింగులచ్చి ఒడ్డొరోల్ల కడుపులు కొట్టినయి.... ఇంకొంచెం దూరంలో... గుయ్‌మంటూ మెడలు

సాచి బాయి తోడుతున్న ప్రొక్లయిన్... దాన్ని చూస్తేనే వెంకటసామికి కాళ్లూ చేతులు వణుకుతాయి. అది రాక్షసిబల్లిలా వచ్చి తమ కులాన్నే మింగేసిందనే భయం...

ఆకాశంకేసి చూసిండు. కండ్లల్ల నీళ్లు తిరిగినయ్... మొగులు కూడా మా ఒడ్డెర బతుకుల్ల చిచ్చు పెట్టవట్టె... రేపు పంచాయితిల ఊరిడిసిపెట్టి పొమ్మంటరు. ఒడ్డెరోల్లు పూర్లుంటె చినుకు పడదని... ఉప్పుల గడ్డపార పాతి ఉప్పలమ్మకు మొక్కుతరు. అని ఎనుకట ఎవడు పుట్టిచ్చిండో గని... ఊరిడిసి పెట్టెకాలమచ్చే... అని తల్లడమల్లమైండు... బోరింగు శబ్దానికి రక్తమంత ఉడుకుతంది. ఊరవతల చెట్టుకింద కూలవడ్డడు....

అయిదు బాయిలు తవ్విండు. నాలుగు బాయిల్ల నీళ్లు పడలేదు. పని ఆపుమన్నరు. సగం పైసలు కూడా ఎవలూ ఇయ్యలేదు. గంగయ్య పటేల్‌ది ఆరు గజాలు తెగింది. సుక్క నీరు పల్లేదు. నీళ్లు పడంగనే మొత్తం పైసలిత్తరా అన్నడు. ఇంకో రెండు గజాలన్న తెగాలె... తడి కూడా కనవడ్తలేదు. బండని పెకిలిచ్చినట్టే కావట్టె... తట్టలు బుట్టలు గడ్డపారలు పికాసిల్తోని పదారు మందిమి. ఎంత చెమటోడ్సినా నాలుగు రూపాయలు చేతిల పెట్టింది లేదు. కొన్ని పైసలున్నా ఇయ్యుండ్రి పటేలా... ఏం తిని బతుకాలే? అని కొంచెం గట్టిగా అడిగినందుకు... పంచాయితి పెట్టిండు... వెంకటసామి గాడు బాయిల ఉప్పుపోసి గడ్డపార పాతిండు... అందుకే చినుకు పడతలేదు. వానపడి బాయిలకు నీళ్లొస్తే వానికి నష్టమాయె... బాయి ఎన్ని గజాలు తెగితే అంత లాభం. వానలు పడద్దని ఒడ్డోల్లందరు మొక్కుతండ్రు... అని పూరంత చెప్పిండు. ఊర్లెకెల్లి ఎల్లగొడితె... పైసలెగ్గొట్టచ్చని బాయిలు తవ్వించుకున్నోల్ల పన్నాగం.

ఎల్లుండి పంచాయితి...

వెంకటసామి మనసంతా ఉడికిపోయింది. బోరింగు గుండెల్ల దిగుతున్నట్టు బర్ బర్ శబ్దాలు... మరోవైపు రాక్షసబల్లి భూమిని బుక్కుతనే వున్నది. గుడిసె దిక్కు పోబుద్దయితలేదు. నర్సవ్వనే రెండ్రోజులున్నుంచి కూలి పనికి పోతుంది.

దారి పొంట గంగిరెద్దులోల్ల శివరాజం పోతుండు...

మూడు కుక్కల్ని గొలుసులతోని ఇగ్గుకపోతుండు.

"ఏందే ఎంకన్న... తీరుపాటుగ కూసున్నవ్... బాయి పని లేదానే" అని అడిగిండు.

"లేదుర శివయ్య... బాయిలన్ని ఎండి ఏరుగప్పలైనయ్... నువ్వేందిరా మూడు కుక్కల్ని పట్టుకపోతున్నవ్.. ఇప్పటికే నాలుగైదు కుక్కలుండె గదా" అనడిగిండు.

"కొడుక్కు పెండ్లి సంబంధాలు సూత్తన్ననే... మా కులంల ఎన్ని కుక్కలుంటె అంత జెల్దిన పిల్లనిత్తరాయే.. కుక్కను సాదనోడు పొల్లనేం సాత్తడని మాకులం మాట... అయిదు కుక్కలున్నయి... ఇంకో మూడు జాడ తీసుకపోతున్న... రేపు కొడుకు గురించి మాట ముచ్చటకు వత్తుండ్రు..." అని కుక్కల్ని గుంజుక పోతుండు.

కొడుకు... అనంగనే వెంకటసామి కండ్లల్ల మల్ల నీళ్లు తిరగినయ్...

ఇప్పటికి... తన కొడుక్కు కూడా పెండ్లి సంబంధాలు వచ్చేటియి... ఆడిప్పుడు కుంటోడై ఇంట్లనే ఉండవట్టె... వాడెంత పని చేసెటోడు... గడ్డపార భూమిలకు దిగేత్తె సగం పోతుండె... ఒక ఊపుతోని భూమి సగం పెకిలిత్తుండె... అట్లాండోడు... నమిలికొండ కాడ బాయిల 'బత్తి' పెట్టి సగం ఎక్కకముందే బండలు పేలినయ్... ఓ బండ ఎగిరొచ్చి కుడి కాలుని తెగనరికింది. అప్పట్నుంచి ఆడి బతుకు మంచమ్మీదే అయింది... అని బాధగా అనుకున్నడు.

మనుసంత మన్నులెక్క తడిసి ఇచ్చుకపోయింది. బోరింగు సప్పుడు వశపడ్తలేదు. అంత సప్పుడుల కూడా... పిల్లనగోయి సప్పుడు దగ్గరైంది. జగ్గాపుకుంట ఒగ్గోల్ల పార్వతయ్య బిరాన బిరాన నడుత్తుండు... కాళ్లకు చెప్పుల్లేవు... ఎవలన్న పట్నాలేసుకుంటుండ్రు కావచ్చు... గంగకుపోయి మైలలు దీసి గంగనీళ్లు

పట్టుకపోతండు...

ఎండకు నెరివడ్డట్టున్నడు...

"పార్వతయ్య... చెప్పులన్న ఏసుకోకపోతివి... పొక్కులత్తయి గాదె... కొంచెం సేపు కూసోని పో..." అన్నడు వెంకటసామి.

"నడుమెక్కడ కూసోవద్దు కాదె... కొమురెల్లి దేవుడు పటపట మంటేల్లపుతడు.. ఆది మల్లన్నాయె... మబ్బుల దరంపురికి పోయిన... కాపోల్లు పట్నాలేసుకుంటుండ్రు... ఇంక పుట్ట బంగారం తేవాలె... ఎనుకట సట్టి ఏడు వారాలు పట్నాలు ఏసుటానికి తీరికుండకపోయేటిది... ఇప్పుడు పట్నాలెవలేసు కుంటండ్రు... అందరు ఊరిడిసిపెట్టి పట్నాల పొంటనే పోవట్టిరి..." అనుకుంట జగ్గాపుకుంట పోయిండు.

ఊరిడిసి పెట్టాలె... ఊరిడిసి పెట్టాలె... ఊరిడిసిపెట్టాలే...

వెంకటసామికి మల్లా మనాది మొదలైంది...

కరకర కరకర... రాల్ల దుబ్బను లేపుకుంట బోరింగు కుమ్మరి పురుగోలె భూమిని తొలుత్తంది...

వెంకటసామి... భారంగా లేసి గుడిసెల దిక్కు పోయిండు.

నెత్తిమీదికెల్లి పిట్ట శెరశెరా అనుకుంట పోయింది.

xxx xxx xxx

"నేను ఉప్పుల గడ్డపార ఎందుకు పాతిన దొరా... అయినా కాలమే గట్లున్నది..." గంట సేపట్నుంచి వెంకటసామి... గ్రామ పంచాయితి ముందర మొత్తుకుంటనే వున్నడు.

"వాడు నా బాయిల ఉప్పుపోసి గడ్డపార పాతి మొక్కంగ నేను చూసిన... ఈని పెండ్లాం కొబ్బరికాయ కొట్టింది. వానలు పడొద్దు... ఇంక నాలుగు గజాలన్నా

బాయి తెగాలె అని మొక్కుకోంగ నేను విన్న... సుట్టు ఊర్లపొంటి వానలు పడుతున్నయ్... ఒక్క మనూర్లెనే వాన బొట్టు లేదు... ఒడ్డోల్లు వానకట్టడి చేత్తరని ఎనుకటి నుంచి అనుకునేదేనాయే..."

గంగయ్య పటేలు గోసి పూసుకుంట లేత్తండు.

అయినెకు ఇంకొందరు సపోర్టు పలికిండ్రు...

సర్పంచి కూడా వింటలేడు...

"అవున్రా ఎంకటసామి.... మొన్న రాపల్లె సర్పంచి కూడా అనవట్టె... మీవూర్లె ఒడ్డెరోల్లున్నంక ఎక్కడ వానలు పడ్తయె అని... గిదేం పనిరా...." అన్నడు.

"కాదు పటేలా... నాలాంటోడు మొక్కితే వానలు పడకుంట ఉంటయా దొర... ఈ గంగయ్య పటేలు పైసలెగ్గొట్టాలని సూత్తండు... ఒక్క పైసియ్యలే బాంచెన్... కిట్టరెడ్డి దొరది ఇరువై గజాలు తీసినం.... కోళ్లఫారం వైకుంటం సేటుది పన్నెండు గజాలు బాయి తవ్వినం... ఉప సర్పంచి బాయిల 'అమీదు' తీసినం... వేము బాపుది బాయి మొదలువెట్టినం... ఎవ్వలొక్క పైస బయాన కూడా ఇయ్యలే... బాయికి ముగ్గు పోసినపుడు కొట్టిన కొబ్బరికాయె, అర్పమిచ్చిన కోడిపిల్ల తప్ప పీల్ల పియ్యి తింటె ఒట్టు బాంచెన్... ఇప్పటికి పదారువేల రూపాయలు పైసలిప్పియ్యుండ్రి... ఊర్లెకెల్లి ఎల్లిపోత...." అన్నడు బాధతోని... దుఃఖంతోని...

స్కూలుకి పోతున్న శ్రీనివాస్‌సార్‌కి ఆ పంచాయితి విచిత్రంగా అన్పిచ్చింది. విషయం అర్థమైనంక "ఏంది సర్పంచ్ సాబ్... ఆడు రెక్కలు ముక్కలు చేసుకొని బాయిలు తవ్విండు. వానలు పడకపోతే వాడేం చేత్తడు... మన కరీంనగర్‌ల పదకొండు కోట్లు పెట్టి రాడార్ మిషిన్లు పెట్టి విమానం తిప్పినా సుక్క పడ్తలేదు. మల్ల రాడార్‌ని తిరుపతికి తీసుకపోయిండ్రు. గవర్నమెంటు మేఘమథనం చేత్తనే వర్షాలు పడ్తలేవు... గీ ఒడ్డోల్లు ఏం చేత్తరు... పాపం గోసపెట్టుకునుడు తప్పితే...." అన్నడు.

శ్రీనుసార్ మాటలు సర్పంచికి కూడా నచ్చలేదు. కొంచెం ఎగాదిగా చూసిండు... “ఊరన్నంక రకరకాల పంచాయితీలైతయి సారు... మీకు బడి టైమైనట్టుంది... కొంచెం ప్రార్థనల వుండుండ్రి... పోరగాండ్లు ఆగమాగమైతండ్రు...” అన్నడు. శ్రీనివాస్ సార్‌కు అక్కన్నించి నడకవ తప్పలేదు.

సర్పంచ్‌కి కూడా వెంకటసామిని వూర్లోంచి పంపాలనే వుంది. ఒడ్డెరోల్ల పేరిట ఎనిమిదిండ్లు సాంక్షన్ అయి వచ్చినయ్... ఆ విషయం ఇంకా వూర్లె ఎవలకు తెల్వది. వీళ్ల నుంచి రూపాయి రాదు. వీళ్లు ఎల్లిపోతే ఆ ఇండ్లనే మన్నెపోల్ల పొంట రాయించొచ్చు... ఇంటికి అయిదువేలు గ్యారంటీగా దొరుకుతయ్... అనే ఆశతోని వెంకటసామిని మాట సొరనిత్తలేదు.

“అది కాదయ్య... గిట్ల బాయిలు తవ్వుచ్చుకొని నీల్లు పడకపోతే నిందవెట్టి ఊరెల్లగొట్టుడు ఏం న్యాయం బాంచెన్... భూమిల కట్టం భూమిల్నేనా... వానలు పడకపోతే మాకు కూడా గోసేనాయె... మేమట్ల బతుకుతం...” వెంకటసామి మాటలు ఎవరి చెవులకెక్కుతలేవు. కొందరూ పట్టించుకోకనే పోతండ్రు... కొందరు వినీవిననట్టే పోతండ్రు.

వెంకటస్వామితో పాటు వొడ్డె కుటుంబాలన్ని పిల్లా పాపల్తోని వచ్చినయ్.. అందరు బీరిపోయి సుత్తండ్రు... వెంకటస్వామి తప్ప ఎవలు మాట్లాడుతలేరు.

“మేం ఈ వూరికచ్చి నాలుగేండ్లయింది. ఎన్ని బాయిలు తవ్వినం. బోరింగులచ్చి మా పొట్ట గొట్టినయ్. పుట్టి బుద్దెరిగిన కాన్నుంచి పది పన్నెండూర్లు తిరిగిన... సలువ గల వూరు... గిక్కన్నే వుందామనుకున్నం... కనికరించుండ్రి బాంచెన్” అన్నడు చేతులు జోడిచ్చి.

ఉప సర్పంచి కల్పించుకున్నడు.

“అది కాదురా వెంకటసామి... నీ ఆపతి నీది మా ఆపతి మాది... వానలు పడాల్నా వద్దురా? పంచాయితోల్లు చెప్పినట్టు... ఇయ్యాల్లో రేపో ఊరెల్లిపోవుడే

మంచిది” అన్నడు లేసుకుంట... ఆయినె వైనాల మనిషే.

“గంతేరా... వూరు సల్లగున్న నాటికి రా... నీ పైసలు ఎటూపోవు... వర్షాలు పడి పంటలు పండినంక రారా... నీ పైసలు నికిచ్చుడు ఖరారు...” అని సర్పంచి కూడా లేసిండు.

పంచాయితీ పెద్దలంతా అదే మాటతో లేచిపోయింగ్రు. ఒడ్డెరోల్లంతా మౌనంగా లేసి గుడిసెల దిక్కు కదిలింగ్రు...

“రేపేంది... ఇయ్యాల్లనే పోదాం... పాంగ్రి...”

బొండిగెలకు దుఃఖం ఎక్కెక్కి వస్తుంటె... వెంకటస్వామి కూడా కదిలిండు.

xxx xxx xxx

తట్టలు బుట్టలు సర్దింగ్రు. బోల్లు బొకెలు ముల్లె గట్టింగ్రు... గుడిసెలు పీకింగ్రు... పొయ్యిరాల్లు తప్ప... అన్నీ ఊడ్చినట్టు సర్దుకున్నరు.

కోళ్లను పిల్లగాండ్లు సంకల పెట్టుకున్నరు...

అప్పటికే పొద్దు గూట్లె పడుతంది...

“నర్సింలపల్లె పోదాం... నాలుగ్గంటల తొవ్వ... పదుంగ్రి...” అన్నడు వెంకటసామి. పిల్లా పాపల్తోని దాదాపు నలుపై మంది...

ఊరు దాటింగ్రు...

చీకటి పడ్డట్టయి... చరచరమని సప్పుడైంది...

నెత్తిమీది నుంచి గుడిసె కట్టెలు భుజానికి దించుకొని వెంకటసామి ఆకాశం దిక్కు చూసిండు.

మబ్బులు ఉరుకుతున్నయ్... మొగులు సరాయిస్తంది....

గుండెల గడ్డపార దిగవడ్డట్టు... బాధగ చూసిండు... ఒక మెరుపు చివ్వున పాకి పోయింది.

"గిదేంది... మేం గింత పాపాత్ములమా... మేం ఊరిడిసి పెడితే వాన పడ్తదా..." వెంకటసామికి తమ దుర్బెట్ట బతుకుల మీద జాలేసింది.

అందరూ ఆకాశం దిక్కే అర్థం కానట్టు సూత్తండ్రు... వెంకటసామి భార్య ముల్లె కింద పడేసి తలెత్తి... ఆకాశం మీద కోపంగా... ఏడ్సుకుంట ఊంచింది.

"థూ... యమశెరల పడ్డట్టు చేత్తివి... నీకు మేం ఏం పాపం చేసినం" అని ముల్లెత్తుకొని నడిచింది.

పది నిమిషాలల్ల మొగులు నల్లసరపు బండ లెక్కయింది.

"ఇయ్యాల్నే వాన పడితే... మమ్ముల్ని ఎల్లగొట్టుడే నయమైందను కుంటరు... భగవంతుడా... నువ్వు ఎవల దిక్కుంటవో అర్థం కాదు..." వెంకటసామి బాధ తోని దుఃఖంతోని అనుకున్నడు.

సలిపిడుగులు పడ్డట్టు... టపటప టపటప... చినుకులు మొదలైనయి... అందరిలోనూ తమ బతుకుల పట్ల అయోమయం...

"పెద్దయ్యా... సముద్రంల తుఫాన్ లేసిందట... ఇయ్యాల్ల బల్లె మా సారు చెప్పిండు" నాలుగో తరగతి చదివే నాగరాజుగాడు చినుకుల్ల ఎగురుతున్నడు..

"వాన రాకడ... పానం పోకడ ఎవ్వలకు తెల్వది. ఈ సంగతి తెల్సికూడా మనల్ని వూరెల్లగొడ్తండ్రు బిడ్డా... అయినా... వానలు పడాల్రా అయ్యా.... మనల్ని ఊరెల్లగొట్టినంక వానలు పడ్డా ఏం కాదు... జనం అగోలిత్తండ్రు... నీళ్ల కరువు రావద్దు బిడ్డా... వానలు పడాలె... నీళ్ల కరువు మాత్రం రావద్దు..."

వెంకటసామి గుండె బరువుతోని అనుకున్నడు...

వాళ్లందరూ పొలిమేర దాటిండ్రు...

వర్షంలో ఊరు కనవడ్తలేదు...

*